ప్రజల మాట ప్రగతి బాట

# మెదక్
నియోజకవర్గం

ఆనందం



ఎన్నికల ప్రచారంలో భాగంగా రామాయంపేటలో మహిళలతో కలిసి దాండియా ఆడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి

అభిమానం



ఎస్సీ కాలనీలో ఎన్నికల ప్రచారంలో భాగంగా మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డిపై పూలవర్షం కురిపిస్తున్న రామాయంపేట పట్టణ వాసులు

## నేడు గౌడ సంఘం ఆత్మీయ సమ్మేళనం

నర్సాపూర్, నవంబర్ 27: నర్సాపూర్ పట్టణంలోని కంజర్ల ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నేడు (మంగళవారం) నిర్వహిస్తున్న గౌడ సంఘం ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని సోమవారం గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సాపూర్ నియోజకవర్గంలోని 8 మండలాలకు చెందిన గౌడ కులస్తులు ఈ ఆత్మీయ సమ్మేళనానికి హాజరవుతారని వెల్లడించారు. రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌గౌడ్, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వెంకట్‌రాంరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని వెల్లడించారు. గౌడ కులస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు.



చల్మెడలో ఎన్నికల ప్రచారంలో చేస్తున్న సర్పంచ్ నర్సింహారెడ్డి

## అన్నివర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం

నిజాంపేట, నవంబర్ 27: అన్ని వర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని చల్మెడ సర్పంచ్ నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చల్మెడలో ఇంటింటికీ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆయన గడప గడపకూ తిరుగుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బాల్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా డైరెక్టర్ భాస్కర్‌రావు, మాజీ ఎంపీటీసీ నాళం కిష్టాగౌడ్, తిరుమల ఆలయ కమిటీ చైర్మన్ మహేశ్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు బాబు, రైతుబంధు సమితి గ్రామ అధ్యక్షుడు లక్ష్మీనారయణ, నాయకులు, గ్రామస్తులు ఎల్లయ్య, మల్లయ్య, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు



ఆర్వోలు, అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా

## పకడ్బందీగా నియమావళి అమలు

**పోలింగ్ సిబ్బందికి సౌకర్యాలు కల్పించాలి: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా**

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 27: జిల్లా ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలు చేయాలని, ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలింగ్ సిబ్బందికి సౌకర్యాలు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ చాంబర్‌లో జిల్లాలోని మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల ఆర్వోలు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్‌లో సౌకర్యాలు కల్పించాలని, పోలింగ్ సామగ్రి సరఫరా, పోలింగ్ సిబ్బందికి సౌకర్యాలతో పాటు భోజనాలు, వెబ్ సీసీ కెమెరా వీడియో రికార్డు, సెక్యూరిటీ, సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మెదక్ నియోజకవర్గంలో 274 పోలింగ్ పోలింగ్ కేంద్రాలు, 28 సెక్టార్లు, ఒక సెక్టార్‌కు ఒక కౌంటర్ ఏర్పాటు చేశామని, నర్సాపూర్ నియోజకవర్గంలో 305 పోలింగ్ కేంద్రాలు, 30 సెక్టార్లు ఉన్నాయని తెలిపారు. పోలింగ్ రోజు ప్రతి 2 గంటలకు పోలింగ్ శాతంపై ఎన్నికల అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. జిల్లా ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలు చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు ఏర్పాటు చేశామని ఆయన వెల్లడించారు. పోలింగ్ అనంతరం ఈవీఎం యంత్రాలు తరలింపు సమయంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

### 48 గంటలు 144 సెక్షన్ అమలు

ఎన్నికల నియామవళిలో భాగంగా ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి 30వ తేదీ పోలింగ్ పూర్తయ్యే వరకు (48 గంటల పాటు) మెదక్ జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. 144 సెక్షన్ అమలులో ఎలాంటి సభలు, సమావేశాలు నిర్వహించరాదని, గుంపులు గుంపులుగా ప్రజలు ఉండరాదన్నారు. ఐదుగురు వ్యక్తుల కంటే మించి ఉండరాదని, ఇంటింటికీ ప్రచారం నిర్వహించరాదని, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్లకు దూరంలో ప్రజలు ఉండాలని, వ్యక్తులు ఎలాంటి ఆయుధాలు కలిగి ఉండరాదని సూచించారు. ఎన్నికల నియామవళి ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి హెచ్చరించారు.



చిన్నశంకరంపేట: గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ మెదక్ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

## బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్ వార్డు సభ్యుడు

చిన్నశంకరంపేట, నవంబర్27: చిన్నశంకరంపేట మండలం జంగరాయి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, వార్డు సభ్యుడు బొమ్మరపోయిన నర్సింలు, శ్రీనివాస్‌రెడ్డి సోమవారం 'ఇఫ్కో' డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి వారు ఆహ్వానించారు. మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి విజయం కోసం తమవంతు కృషి చేస్తామని నర్సింలు, శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ డైరెక్టర్లు సంజీవరెడ్డి, ప్రభాకర్, సింగిల్‌విండో డైరెక్టర్ సిద్ధిరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రామాయంపేటలో మిలిటరీ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న సీఐ.లక్ష్మీబాబు

## శాంతిభద్రతలే లక్ష్యంగా పోలీస్ కవాతు

రామాయంపేట, నవంబర్ 27: తెలంగాణ సాధారణ ఎన్నికల్లో భాగంగా పారామిలిటరీ బలగాలతో శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పట్టణంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామని రామాయంపేట సీఐ లక్ష్మీబాబు అన్నారు. సోమవారం రామాయంపేట పట్టణంలోని మిలిటరీ బలగాలతో హరిజన వాడనుంచి వీధులను తిరిగారు. అనంతరం సీఐ లక్ష్మీబాబు మాట్లాడుతూ.. ఓటు హక్కు ఉన్నవారంతా రాబోయే ఎన్నికల్లో ధైర్యంగా ఓటును వినియోగించుకోవాలని, ప్రజలంతా పోలీసులకు సహకరించాలన్నారు. శాంతి భద్రతలే లక్ష్యంగా పోలీసులు పనిచేస్తారని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పోలీసుల కవాతులో రామాయంపేట ఎస్సై రంజిత్, పారామిలిటరీ బలగాలు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.



రామాయంపేటలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

## కాంగ్రెస్ నాయకులు రైతు ద్రోహులు

రామాయంపేట రూరల్, నవంబర్27: కాంగ్రెస్ పార్టీ రోజురోజుకూ రైతుల పట్ల కక్ష పెంచుకుని రైతుబంధు రాకుండా అడ్డుకుందని బీఆర్ఎప్ నాయకులు చిట్టిమల్లి నరేందర్‌రెడ్డి, పిట్ల యాదగిరి, వివేక్ రెడ్డి, రాజు ఆరోపించారు. సోమవారం రామాయంపేటలో వారు మాట్లాడుతూ.. రైతులకు 24 గంటల కరెంట్ వద్దనడం, ధరణి రద్దు చేయలనడం మరువక ముందు రైతుబంధు రాకుండా చేసి రైతుల దృష్టిలో కాంగ్రెస్ నాయకులు ద్రోహులుగా మిగిలిపోయారని విమర్శించారు. రైతులంతా కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలన్నారు.

## ఆలయాల్లో కార్తిక వెలుగులు



ఏడుపాయల వనదుర్గా భవానీమాత ఆలయంలో పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

పాపన్నపేట/మెదక్ మున్సిపాలిటీ/మెదక్ రూరల్/రామాయంపేట రూరల్,, నవంబర్27: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గా భవానీమాత క్షేత్రంలో కార్తిక శోభ సంతరించుకున్నది. సోమవారం వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి కార్తిక దీపోత్సవంలో పాల్గొన్నారు. ఏడుపాయల పాలక మండలి చైర్మన్ బాలాగౌడ్, ఆలయ ఈవో మోహన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్తిక దీపాలను ముట్టించి 'లక్ష దీపోత్సవ' కార్యక్రమాన్ని ప్రారంభించారు. లక్ష దీపాల కాంతులతో ఏడుపాయల రమణీయంగా దర్శనమిచ్చింది. ఆకుల్లో ప్రమిధలను వెలిగించి నీటిపై వదలడంతో ఏడుపాయల కార్తిక శోభ సంతరించుకున్నది. ఏడుపాయల్లో పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులతోపాటు ఏడుపాయల సిబ్బంది, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

- కార్తిక పౌర్ణమి పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని ఆలయాలు తులసి పూజలతో కిటకిటలాడాయి. బ్రాహ్మణ వీధి, మార్కెట్‌లోని శివాలయాలు, బాలాజీ మఠం, కుమ్మరిగడ్డ హనుమాన్ దేవాలయం, కోదండ రామాలయంలోని శివాలయంతో పాటు తదితర దేవాలయాల్లో మహిళా భక్తులు శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్తిక దీపాలు వెలిగించారు. ఉదయం పూట తమ ఇండ్లల్లో తులసి చెట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోదండ రామాలయం మహిళా భక్తులతో కిక్కిరిసింది.
- కార్తికమాసం పౌర్ణమిని పురస్కరించుకొని మెదక్ మండలంలో కార్తిక దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. సోమవారం మాచవరంలోని శివాలయం, కొయ్యగుట్ట మల్లికార్జునస్వామి ఆలయల్లో కార్తిక దీపోత్సవం సందర్భంగా దేవాలయాల్లో శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. మంబోజిపల్లి శివారులోని కొయ్యగుట్ట మల్లికార్జునస్వామి అలయంలో 11 వేల బిల్వ పత్రాలతో ప్రత్యేకపూజలు, 21 లీటర్ల పంచామృత అభిషేకం చేశారు. ఆలయప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.
- కార్తిక పౌర్ణమి వేడుకలను రామాయంపేట మండలంలో సోమవారం భక్తి శ్రద్ధలతో మహిళలు, చిన్నారులు, భక్తులు నిర్వహించారు. ఈసారి కార్తిక పౌర్ణమి సోమవారం రావడంతో శివాలయాలు మహిళలతో కిక్కిరిసిపోయాయి.



మెదక్: కోదండ రామాలయంలో దీపాలను వెలిగిస్తున్న మహిళలు



మల్లన్న స్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

## చాముండేశ్వరీ ఆలయంలో భక్తుల రద్దీ

చిలిపిచెడ్, నవంబర్ 27: కార్తిక పౌర్ణమి సందర్భంగా సోమవారం మండలంలోని చిట్కుల్ గ్రామ శివారులోని వెలసిన శ్రీ చాముండేశ్వరీ ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకుని దీపాలు వెలగించారు. అనంతరం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం సమీపంలోని మంజీరా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి కుంకుమార్చనలు, ఒడిబియ్యం సమర్పించారు. ఆలయ ప్రధాన పూజారి ప్రభాకరశర్మ అమ్మవారికి పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.